RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 97 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం 08.10.2026 | పేజీలు : 8




దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా : ప్రధాని మోదీ

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్న మోదీ
- ఈ స్థాయికి చేరుకుంటానని తాను ఎన్నడూ ఊహించలేదని వ్యాఖ్య
- ప్రజల నిరంతర ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైందంటూ ప్రజలకు కృతజ్ఞతలు
- దేశ ప్రజలే తనకు దైవ స్వరూపమని, వారి నమ్మకమే తన బలమన్న ప్రధాని

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో .... మిగతా 2వ పేజీ లో..

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక..
2 డీఏ లకు విడుదల

- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం



నిత్యం నిఘా, హైదరాబాద్ : దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది... మిగతా 2 వ పేజీ లో..

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..
వాటిని మెడల్స్ గా భావిస్తా : రాహుల్ గాంధీ

- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



2

శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు.. అండగా నిలిచిన కోమటిరెడ్డి

- బధిర దంపతుల బిడ్డ వైద్యానికి మంత్రి కోమటిరెడ్డి చేయూత
- తక్షణ సాయంగా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం
- చిన్నారి సర్జరీ ఖర్చు మొత్తం భరిస్తానని హామీ



2

అణువుల రహస్యాన్ని ఛేదించిన పరిశోధన..
ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్సోసోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం



2

నా వీడియోలను మార్ఫింగ్ చేశారు
- బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్



2

- తనపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని చామల ఆరోపణ
- బీఆర్ఎస్ అక్రమాస్తులు బయటపెడుతున్నందుకే ఈ దాడి అని వ్యాఖ్య
- వీడియోలు మార్ఫింగ్ చేసిన వారిపై కేసులు పెడతానని హెచ్చరిక

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం..
- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ

నిత్యం నిఘా, హైదరాబాద్ : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో .. 2



మహిళలకు రూ.2,500, బంగారం..
- ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం



- మహిళలకు రూ.2500 నెలవారీ సాయం అంటూ జరుగుతున్న ప్రచారం
- ఇది పూర్తిగా అసత్యమని కొట్టిపారేసిన ప్రభుత్వం
- సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంతో పాటు, కల్యాణ లక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇదంతా పూర్తిగా అసత్య ప్రచారమని ఇందులో ఎలాంటి వాస్తవం లేదని బుధవారం స్పష్టం చేసింది. బతుకమ్మ పండుగ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ ఉపయోగించి సృష్టించిన నకిలీ వీడియో అని ప్రభుత్వ ఫ్యాక్ట్-చెక్ విభాగం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి చిత్రానికి డీప్ ఫేక్ ఆడియోను జోడించి ఈ వీడియోను రూపొందించారని... 2

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి 2

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం

దసరా కానుక..

2 డీఏ లకు విడుదల

మొదటిపేజీ తరువాయి.. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

వాటిని మెడల్స్ గా భావిస్తా : రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి.. నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు.. అండగా నిలిచిన కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. పుట్టుకతో మాట, వినికిడి లోపంతో బాధపడుతున్న నవజాత శిశువు వైద్యం కోసం ఓ నిరుపేద బధిర దంపతులకు ఆయన రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చి వారికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫణిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేశ్ కుమార్, రజిత దంపతులు పుట్టుకతోనే మూగ, బధిరులు. ఇటీవల వారికి జన్మించిన శిశువుకు కూడా ఇదే సమస్య ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులోనే సర్జరీ చేస్తే బిడ్డకు మాట, వినికిడి వచ్చే అవకాశం ఉందని, అయితే అందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ దంపతులు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని ఈరోజు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిపోయిన మంత్రి, చిన్నారిని చేతుల్లోకి తీసుకుని వారికి ధైర్యం చెప్పారు. తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే రూ. 2 లక్షల రూపాయల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "మీ చిన్నారి గురించి ఆందోళన వద్దు. ఆ బిడ్డకు మాటలు వచ్చేలా చేసే బాధ్యత నాది. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, మెరుగైన శస్త్రచికిత్స కోసం ప్రత్యేక వైద్యులతో తానే స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో ఆ దంపతులు భావోద్వేగానికి గురై కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మంత్రి కోమటిరెడ్డిని స్థానికులు ప్రశంసించారు.

నా వీడియోలను మార్ఫింగ్ చేశారు

- బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. తాజాగా, తనపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులపై తాను వ్యతిరేకంగా మాట్లాడినట్లు తన వాయిస్‌ను, వీడియోలను ట్యాంపరింగ్ చేసి సర్క్యులేట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన చామల... బీఆర్ఎస్ నేతల పదేళ్ల అక్రమాస్తులను తాను బయటపెడుతున్నందుకే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. "బీఆర్ఎస్ నేతల అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్షగట్టి మార్ఫింగ్ వీడియోలతో దాడి చేస్తున్నారు. ఈ కుట్రల వెనుక ఉన్న వారిపై కచ్చితంగా కేసులు పెడతాను" అని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ కూడా స్పందించారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. తెలంగాణ రాజకీయాల్లో మార్ఫింగ్ వీడియోల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా : ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి..
బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడు సార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోదీ హయాం లో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, 'గ్లోబల్ సౌత్' దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

అణువుల రహస్యాన్ని ఛేదించిన పరిశోధన..

- ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

మొదటిపేజీ తరువాయి..
రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో (asymmetric organic synthesis) నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ (autocatalysis) వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో (mirror-image forms) ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు. మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం..

- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

మొదటిపేజీ తరువాయి..
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

మహిళలకు రూ.2,500, బంగారం.. ఆ ప్రచారంలో నిజం లేదన్న ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..
ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో, ప్రజలు ఇలాంటి నిరాధారమైన, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేకుండా వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. అయితే, వైరల్ వీడియోలో పేర్కొన్నట్లుగా ప్రతినెలా రూ. 2,500 సాయం, రెండు తులాల బంగారం వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని స్పష్టమవుతోంది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న ఇలాంటి నకిలీ వార్తల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

మొదటిపేజీ తరువాయి.. డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దసరా.. సద్దుల బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు

- **5వ తరగతి బాలికలను కొట్టినట్లు ఆరోపణలు.. కలెక్టర్ సుమోటో స్పందన**
- **విచారణ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలిపై చర్యలు**



వరంగల్/ నెక్కొండ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా నెక్కొండ లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)లో ఐదో తరగతి విద్యార్థులపై బెత్తంతో దాడి చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వెలువడిన కథనాలపై జిల్లా కలెక్టర్ సత్యశారద సుమోటోగా స్పందించారు. ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టేందుకు ఎంపీడీవోను నియమించారు.విచారణలో వచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థులను బెత్తంతో కొట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రజినిని సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులపై ఎలాంటి వేధింపులు, శారీరక దాడులను సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

సేవా జ్యోతి యాత్రకు హనుమకొండలో ఉత్సాహభరిత స్పందన

- **అంబేడ్కర్ జంక్షన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు యాత్ర**
- **దివిటీలు, పార్టీ జెండాలతో పాల్గొన్న బీజేపీ శ్రేణులు**



హనుమకొండ ,అక్టోబర్ 07(నిత్యం నిఘాప్రతినిధి): హనుమకొండ నగరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం 'సేవా జ్యోతి యాత్ర' ఉత్సాహభరితంగా నిర్వహించారు. 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా చేపట్టిన ఈ యాత్ర స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమై అమరవీరుల స్థూపం వరకు కొనసాగింది. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో దివిటీలు, పార్టీ జెండాలు పట్టుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ రావు మాట్లాడుతూ ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించడమే సేవా జ్యోతి యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం, పార్టీ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా ప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా పనిచేయాలి

- **అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయాలిబీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపు**



వరంగల్ ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండల కన్వీనర్ కర్నే రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి అర్హులైన పట్టభద్రుడు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, నమోదు వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని కోరారు. ఓటర్లను చైతన్యపర చడంతో పాటు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో బీజేపీ ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అర్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కర్నే వాసుదేవ్, సీనియర్ నాయకులు కత్తి సాంబయ్య, శ్రీరామ్ నాగరాజు, ఏలుగు రవికుమార్, గందే గోపి, సర్ల సంజీవ్, రావుల రాజేశ్వర్, పాలపోయిన వర్షిత్, కార్తీక్, వంశీ, వరుణ్, ఆదిత్యతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



స్మశాన వాటిక రహదారికి మరమ్మతులు

- **వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపేలా పనులు**
- **వీబీజీ రాంజీ పథకం నిధులతో అభివృద్ధి పనులు**



ములుగు జిల్లా/తాడ్వాయి ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని స్మశాన వాటిక, చెత్త నిల్వ కేంద్రానికి వెళ్లే రహదారిని గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. వర్షాకాలంలో రహదారి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరమ్మతు పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వీబీజీ రాంజీ పథకంలో భాగంగా ఈ పనులకు నిధులు మంజూరు కావడంతో రహదారి సమస్యకు పరిష్కారం లభించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని మురుగునీటి కాలువలు, పంట కాలువలు, నీటి నిల్వ కార్యక్రమాలు, పారిశుద్ధ్య సమస్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఈ పథకం ద్వారా అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని కాటాపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట రామ నరసయ్య, సాంకేతిక సహాయకుడు, క్షేత్ర సహాయకుడు రాసూరు సంజీవ, కుసుమ వెంకటేశ్వర్లు, గండు సదయ్య, దొడ్డపల్లి సాంబయ్య, చిట్టినేని శ్రీనివాస్, గడ్డం మొగిలి తదితరులు పాల్గొన్నారు..

హన్మకొండలో డిజిటల్ తెరపై మోదీ ప్రసంగం

- **భారీ తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన బీజేపీ శ్రేణులు**
- **కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**



హన్మకొండ ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): 'వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని హన్మకొండలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ తెరపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేశాభివృద్ధి, సంక్షేమ పథకాలు, వికసిత్ భారత్ లక్ష్యాలపై ప్రధానమంత్రి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జినుకల లక్ష్మణరావు

- **నియామక పత్రం అందజేసి ఘనంగా సన్మానం**



హన్మకొండ ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జినుకల లక్ష్మణరావును నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్య వేదికను మరింత బలోపేతం చేసేందుకు జినుకల లక్ష్మణరావు కృషి చేయాలని గుడిమళ్ల రవికుమార్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు జినుకల లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

400 బైకులతో సేవా జ్యోతి యాత్ర

- **ఎల్కతుర్తి నుంచి సిద్ధిపేట వరకు కొనసాగిన బైక్ ర్యాలీ**
- **మోదీ ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన బీజేపీ శ్రేణులు**



ఎల్కతుర్తి, అక్టోబర్07 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఎల్కతుర్తి నుంచి సిద్ధిపేట వరకు సేవా జ్యోతి యాత్రను బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీగా నిర్వహించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దతు శ్రీకాంత్ యాదవ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎల్కతుర్తి నుంచి భీమదేవరపల్లి మీదుగా హుస్నాబాద్ చేరుకున్న ర్యాలీలో వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ నుంచి సేవా జ్యోతిని సిద్ధిపేట వరకు కొనసాగించారు. ఎల్కతుర్తి మండలం నుంచి సుమారు 60 బైకులు, వివిధ ప్రాంతాల నుంచి కలిపి దాదాపు 400 బైకులతో పార్టీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ సేవా స్ఫూర్తి, దేశాభివృద్ధి సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో సేవా జ్యోతి యాత్ర నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మద్దతు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ సేవా జ్యోతి యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మోదీ మరింత కాలం సేవలందించాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఘనంగా సమాచార హక్కు సాధన కమిటీ రెండో ఆవిర్భావ సభ

- రవీంద్రభారతిలో నిర్వహణ.. రాష్ట్రవ్యాప్తంగా 800 మంది కార్యకర్తల హాజరు
- పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి సమాచార హక్కు చట్టం కీలకం



పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రెండో ఆవిర్భావ సభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 800 మంది సమాచార హక్కు కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం, అందుబాటులో ఉన్న సమాచార హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చట్టం ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, చట్టంపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు గోపీనాథన్, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సభకు పెద్దపల్లి జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు పాండ్రాల రాజు, జిల్లా ఇన్‌చార్జ్ తోగరి సురేష్, జిల్లా సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ కొమురోజు సురేష్, జిల్లా సమన్వయ కర్త అశోక్‌కుమార్, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు వేగోలపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధులు కాశిపేట శ్రీకాంత్, కల్వల యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు యాసం శ్రావణ్, ఆర్ల సనిల్, జిల్లా కార్యదర్శి బూడిద అనిల్ హాజరయ్యారు. అదేవిధంగా మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సునీల్, నియోజకవర్గ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ ఆకుల రాఘవ ముదిరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు బూడిద రాజు, రామగుండం డివిజన్ ఉపాధ్యక్షుడు రామచందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కల దేవేందర్, మంథని డివిజన్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ ఎల్పుల సామ్రాట్, మంథని డివిజన్ ఉపాధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోషక మాసం సందర్భంగా ఘనంగా సామూహిక శ్రీమంతాలు

- గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించిన వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది
- ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచన



జనగామ జిల్లా/రఘునాథపల్లి, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): పోషక మాసం సందర్భంగా రఘునాథపల్లి మండలం కోమల్ల సెక్టార్ పరిధిలోని కోమల్ల గ్రామంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోమల్ల గ్రామ ఉపసర్పంచ్ నర్ర అశోక్, వైద్యురాలు పావని, ఏఎన్ఎం రజిత, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నసీమున్నిసా బేగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన వివిధ ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వారు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచ్ నర్ర అశోక్ సూచించారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ గర్భిణులు ఐరన్ మాత్రల వినియోగం, రక్తహీనత నివారణ, టి.టి. టీకా తదితర ఆరోగ్య అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గర్భధారణ సమయంలో పోషకాహారం తీసుకోవడం తోపాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నసీమున్నిసా బేగం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పోషకాహార కార్యక్రమాల గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోమల్ల సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, ఆశా కార్యకర్తలు, వీవీఏలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు భేషరతుగా రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి

- దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడికి ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ మంజూరు చేయాలి
- గుడుంబా తయారీని అరికట్టకపోతే గీత కార్మికుల జీవనోపాధికి తీవ్ర నష్టం: గండు సదయ్య



ములుగు జిల్లా/తాడ్వాయి , అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): దరఖాస్తు చేసుకున్న ప్రతి గీత కార్మికుడికి ఎలాంటి షరతులు విధించకుండా నెలకు రూ.4 వేల పింఛన్ మంజూరు చేయాలని తాడ్వాయి మండల గీత కార్మికుల అధ్యక్షుడు గండు సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు వారికి అందాల్సిన బీమా ప్రయోజనాలు కూడా సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గుడుంబా తయారీ రోజు రోజుకూ పెరుగుతుండటంతో నాణ్యమైన తాటికల్లుకు ఆదరణ తగ్గుతోందని తెలిపారు. తాటికల్లు విక్రయాలు తగ్గిపోవడంతో గీత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. గుడుంబా తయారీని అరికట్టడంలో ఆబ్కారీ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.తాటి చెట్లపై ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి గీత కార్మికులు నాణ్యమైన తాటికల్లును ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు గుడుంబా తయారీదారులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా నాసిరకం, హానికర పదార్థాలను కలిపి గుడుంబా తయారు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడటంతో పాటు గీత కార్మికుల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుడుంబా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆబ్కారీ శాఖను సమర్థవంతంగా పనిచేయించాలని కోరారు. గుడుంబా తయారీని అరికట్టకపోతే అనేక గీత కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి గుడుంబా తయారీని అరికట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలకుర్తి వెంకట రామనరసయ్య గౌడ్, పులిచిన నర్సయ్య గౌడ్, గడ్డం మొగిలి గౌడ్, సామాజిక మాధ్యమాల కార్యదర్శి బెల్లంకొండ నరేష్, మండల ప్రధాన కార్యదర్శి సిరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

- మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డి
- 200 మంది మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ



హన్మకొండ , అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి); అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డి అన్నారు. హన్మకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 200 మంది అర్హులైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఎమ్మెల్యే ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు.మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

- బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందజేతమెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన కాకులమర్రి ప్రదీప్‌రావు



ములుగు జిల్లా/ హన్మకొండ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను బీఆర్ఎస్ నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు పరామర్శించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు ఆయన ఆస్పత్రికి వెళ్లి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్, నాగలక్ష్మి దంపతుల చిన్నారులు నిహస్వి (5), నిహాంత్ (2) చెత్త కుప్పల వద్ద చెలరేగిన మంటల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ప్రదీప్‌రావు పరామర్శించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రదీప్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కావిరి చిన్నికృష్ణతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మోకుదెబ్బలో పల్లె గౌడ కుటుంబాల చేరిక

- పేద గీత కార్మికులకు అండగా నిలుస్తాం: కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్
- గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం



నిజామాబాద్ ,అక్టోబర్ 07(నిత్యం నిఘా ప్రతినిధి): గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మండలం పల్లె గ్రామపంచాయతీ పరిధికి చెందిన 15 గౌడ కుటుంబాలు జిల్లా గౌడ సంఘానికి రాజీనామా చేసి, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘంలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వేంపల్లి సరోజ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ చిన్నాగౌడ్, జిల్లా కార్యదర్శి వేంపల్లి సంతోష్ గౌడ్, జిల్లా నాయకుడు బొడ్డు తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో 39 గీత కార్మిక కుటుంబాలు, 11 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణకు గురిచేయడం అన్యాయమన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుని అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండలంలో కొందరు గౌడ కులస్తులు పేద గీత కార్మిక కుటుంబాలను వృత్తి చేసుకోకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఆర్థిక, రాజకీయ అండదండలతో పేద గౌడ కుటుంబాలను అణచివేయడాన్ని మోకుదెబ్బ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. పేద గౌడ గీత కార్మికులు, గౌడ కులస్తులకు అండగా మోకుదెబ్బ నిలుస్తుందని, గౌడ కులస్తులందరికీ సమాన హక్కులు, వాటాలు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా మోకుదెబ్బను బలోపేతం చేస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్ర నాయకులను జిల్లాకు ఆహ్వానించి భారీ సభ నిర్వహించి పేద గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె గౌడ కులస్తులు భైరగోని సాయిగౌడ్, బూరుగు రాజుగౌడ్, ఉదగామ్ బాలరాజ్ గౌడ్, రంగారి పోషగౌడ్, బొంగోని ఆంజనేయులు గౌడ్, ఉదగామ్ సత్యనారాయణ గౌడ్, ఏనుగంటి వివేక్ గౌడ్, భైరగోని సచిన్ గౌడ్, బొంగోని నవీన్ గౌడ్, ఏనుగంటి మహేష్ గౌడ్, భైరగోని సిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ఎప్పుడు?

- **ఏళ్లు గడుస్తున్నా నిరుపేదల ఎదురుచూపులే.. పారదర్శకతపై కౌన్సిలర్ల అనుమానాలు**
- **రాజకీయ జోక్యం లేకుండా అర్హులకే ఇళ్లు కేటాయించాలని డిమాండ్**

మహబూబాబాద్ జిల్లా/తొర్రూరు, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): తొర్రూరు పట్టణంలోని గోపలగిరి రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై నిరుపేదల్లో ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణాలు పూర్తయినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఇళ్లను లబ్ధిదారులకు అందించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారులు పలుమార్లు వచ్చి పరిశీలించి, త్వరలోనే పంపిణీకి సిద్ధం చేస్తామని చెప్పడం మినహా ఇళ్ల పంపిణీ జరగలేదని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల పంపిణీని వేగవంతం చేసి అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో పలుమార్లు నిరసనలు, రిలే దీక్షలు, ధర్నాలు, వినతిపత్రాల కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలతో గృహ ప్రవేశాలు చేయించిన సందర్భాలు కూడా ఉన్నాయని నాయకులు పేర్కొంటున్నారు. అయితే ఇళ్ల కోసం పోరాడిన సీపీఎం నాయకులపై కేసులు నమోదు చేయడం తోపాటు, ఈ అంశంపై వార్తలు రాసిన జర్నలిస్టుపైనా కేసు నమోదు చేసి జైలుకు పంపిన ఘటన అప్పట్లో తీవ్ర చర్చకు దారి తీసింది.



CPI-MLమాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి...



సీనియర్ జర్నలిస్ట్ కొమ్మనబోయిన యాకయ్య...

వార్తలు రాసినందుకే కేసులు పెట్టారని జర్నలిస్టు ఆరోపణ

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసినందుకే తనను సీపీఎం నాయకుడిగా చిత్రీకరించి అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని జర్నలిస్టు కొమ్మనబోయిన యాకయ్య ఆరోపించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని, అధికార పార్టీ నాయకుల జోక్యంపై ప్రశ్నిస్తూ కథనాలు రాయడం వల్లే తనపై కేసులు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై వార్తలు రాసినప్పుడు విమర్శలను స్వీకరించి తప్పులను సరిదిద్దుకోవాల్సింది పోయి జర్నలిస్టులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

కమిషనర్‌పై కౌన్సిలర్ల ఆరోపణలు

ఇళ్ల కేటాయింపులో అధికార పార్టీ నాయకుల జోక్యం ఉందంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో వార్డు కౌన్సిలర్లను భాగస్వాములను చేయకుండా, రాజకీయ ప్రభావంతో ఇళ్లను కేటాయించే ప్రయత్నం జరుగుతోందని మూడో వార్డు కౌన్సిలర్ తుర్పాటి రవి, నాలుగో వార్డు కౌన్సిలర్ పేర్ల జంపన్న ఆరోపించారు.
అర్హులు, అనర్హులను గుర్తించే ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కోరిన సమయంలో కమిషనర్‌తో వాగ్వాదం జరిగినట్లు వారు తెలిపారు. కౌన్సిలర్లమైన తమ పట్లే అధికారులు దురుసుగా వ్యవహరిస్తే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందని వారు ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గతంలో ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలోనూ కమిషనర్ వ్యవహారశైలిపై తమకు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

రాజకీయ జోక్యం లేకుండా పంపిణీ చేయాలి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అధికార, ప్రతిపక్ష పార్టీల జోక్యం లేకుండా అధికారులు పూర్తిగా పారదర్శకంగా వ్యవహరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి మాత్రమే ఇళ్లు కేటాయించాలని కోరారు.

అనర్హులకు ఇళ్లు కేటాయించినట్లు తేలితే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

అర్హులకే ఇళ్లు.. జాబితా ఇంకా పూర్తికాలేదు: కమిషనర్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా కొనసాగుతోందని తొర్రూరు మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ తెలిపారు. గోపలగిరి రోడ్డులో నిర్మించిన ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి జాబితా రూపొందిస్తున్నామని, ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని చెప్పారు. వార్డు అధికారులు దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నారని, అర్హులైన వారినే గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు జాబితా పంపిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే గోపలగిరి రోడ్డులోని ఇళ్లతోపాటు అన్నారం రోడ్డులో ఉన్న ఇళ్లను కూడా కేటాయించే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు.

ఈవీఎం గోదాంలో పకడ్బందీ భద్రత

- **నెలవారీ తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**
- **భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం వద్దు.. అధికారులకుకలెక్టర్ ఆదేశం**

ములుగు, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను, భద్రతా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ నెలవారీగా తనిఖీ చేశారు. గోదాం ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసిన సీల్‌ను పరిశీలించడంతోపాటు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిరంతర నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరా, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే పరికరాలను తనిఖీ చేశారు. అగ్నిప్రమాదం లేదా ఇతర భద్రతాపరమైన సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధివిధానాలపై సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. గోదాంలో భద్రతా ప్రమాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఈవీఎం గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. గోదాంను సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ నితీష్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



కాకతీయ మిత్రమండలి భవనానికి శంకుస్థాపన

- **వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం**
- **పడమరకోటలో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ**





వరంగల్, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 38వ డివిజన్ పరిధి పడమరకోటలో కాకతీయ మిత్రమండలి భవన నిర్మాణానికి మాజీ మంత్రి శ్రీమతి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ఆమె శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వరంగల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్‌రాజ్, మాజీ కార్పొరేటర్లు భైరబోయిన ఉమ, దామోదర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ వైస్ చైర్మన్ బండి జనార్దన్ పటేల్, మార్కెట్ డైరెక్టర్ గజ్జల శ్యామ్, పోశాల సారంగం, భైరబోయిన శివ, కలకోట్ల రమేష్, పాల రంజిత్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో మూడో రోజూ కొనసాగిన దళిత యువతి ధర్నా

- **మున్సిపల్ చైర్మన్ ఇంటి ఎదుట ఆందోళన.. న్యాయం జరిగే వరకు విరమించేది లేదన్న యువతి**
- **సంఘీభావం తెలిపిన డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆయూబ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు**





వర్ధన్నపేట, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేటలో ఓ దళిత యువతి చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరడంతో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చైర్మన్ కుమారుడు పాలకుర్తి శ్రీకాంత్ తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని యువతి ఆరోపిస్తూ, తనకు న్యాయం చేయాలని, శ్రీకాంత్‌తో తన వివాహం జరిపించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కొనసాగిస్తోంది. తనకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని యువతి స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారం వర్ధన్నపేటలో రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

యువతికి కాంగ్రెస్ నేతల సంఘీభావం

యువతి ధర్నా కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆందోళన ప్రదేశానికి చేరుకుని ఆమెను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆయూబ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు యువతికి సంఘీభావం తెలిపారు. యువతికి న్యాయం జరిగేలా తమవంతు సహకారం అందిస్తామని, సమస్యను పరిశీలిస్తామని కాంగ్రెస్ నాయకులు భరోసా ఇచ్చినట్లు సమాచారం

పెరుగుతున్న సంఘీభావం

యువతి ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటిస్తుండటంతో ఈ వ్యవహారంపై చర్చ మరింత విస్తరిస్తోంది. సంఘీభావం తెలిపిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ అబిడి రాజిరెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోశాల వెంకన్నగౌడ్, ఈగ దామోదర్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు. యువతి చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 07 : జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తో కలిసి సందర్శించారు.సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు.ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు.ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్,ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్,విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తిమ్మారెడ్డిగూడలో హర్ ఘర్ జల్ కార్యక్రమం



నిత్యం నిఘా, షాబాద్, అక్టోబరు 7 : షాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామంలో నీటి సరఫరా పైపులైన్లు, కనెక్షన్లు, నీటి లభ్యత తదితర అంశాలను పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ హారిక, ఏఈ, లైన్మెన్లు, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మరణించిన షేక్ ఫరీద్ కుటుంబానికి పి.జి.ఆర్ ఆర్థిక సహాయం



నిత్యం నిఘా, గుర్రంపోడు, అక్టోబర్ 07 : గుర్రంపోడు మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో బొడ్రాయి ఎదురుగా నివాస ముంటూ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన షేక్ ఫరీద్ కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి (పి.జి.ఆర్) పరామర్శించారు.ఫరీద్ మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వేముల యాదయ్య,షేక్ కాసిం, వినయ్,జానీ పాషా,పవన్, వేముల సరస్వతి,మహమ్మద్ అబ్బాస్,వేముల లక్ష్మమ్మ, ఇటికాల లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు



నిత్యం నిఘా, మంథని, అక్టోబర్-07 : మంథని పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. గోదావరి గౌతమేశ్వరి ఆలయం సమీపంలోని గట్టు సుశీల, పెంజూరుకట్టకు చెందిన మున్ననూరి ఆనందదేవి, నడివీధిలోని లక్ష్మీనారాయణ ఆలయం సమీపంలో చొప్పకట్ల శంకర్‌రావు, ఉస్మాన్‌పురకు చెందిన ఎం.డి. వలి కుటుంబాలను ఆయన పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రుణాల మాయలో పడొద్దు

- **సైబర్ మోసాలపై ములుగు జిల్లాలో ప్రత్యేక అవగాహన ప్రచారం**
- **అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్**



ములుగు, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తక్షణ రుణాలు, తక్కువ వడ్డీకే రుణాలు, నిమిషాల్లో రుణం మంజూరు చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. రుణం మంజూరుకు ముందు రుణ ప్రక్రియ రుసుము, ముందస్తు రుసుము, జీఎస్టీ తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరుతూ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇలాంటి నకిలీ రుణ ఆఫర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లోనూ తొందరపడి ముందస్తుగా డబ్బులు చెల్లించ వద్దని, ముందుగా రుణ ఆఫర్ నిజమైనదో కాదో పరిశీలించాలని ఎస్పీ సూచించారు. రుణదాత వివరాలను పూర్తిగా ధృవీకరించిన తర్వాత అధికారిక సంస్థల ద్వారా మాత్రమే రుణ సేవలను పొందాలని తెలిపారు.అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలు, రుణ యాప్‌ల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్యలు, సంకేతపదాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించ వద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ నేరాల సహాయ కేంద్రానికి ఫోన్ చేయాలని, అలాగే అధికారిక సైబర్ నేరాల ఫిర్యాదు వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్ కుమార్, ములుగు సీఐ దారం సురేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు, డీసీఆర్‌బీ ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెల్లి కిరణ్ గౌడ్‌కు అభినందనలు

- **రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శిగా నూతన బాధ్యతలు**
- **శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచిన సోషల్ మీడియా బృందం**



పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఆరెల్లి కిరణ్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ డీఎస్‌బీ సోషల్ మీడియా బృందం సభ్యులు అభినందించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆశీస్సులతో కిరణ్ గౌడ్‌కు ఈ బాధ్యతలు లభించాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని సోషల్ మీడియా బృందం సభ్యులు అన్నారు. తనను అభినందించిన బృందం సభ్యులకు కిరణ్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ కొనసాగించాలని కోరారు. రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా బృందం సభ్యులు పంచిక దేవేందర్, రేపాక శ్రీకాంత్, అరుణ్, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ ర్యాలీ

- **ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్**
- **వరంగల్‌లో భారీ ర్యాలీలో పాల్గొన్న గుండు సుధారాణి**



వరంగల్, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాస్వామ్య పరిరక్షణ వారం కార్యక్రమంలో భాగంగా బుధవారం వరంగల్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్ నుంచి కాశిబుగ్గ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ర్యాలీలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌తో కలిసి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఇండియా కూటమికి చెందిన వరంగల్ జిల్లా అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

బడికి కూతవేటు దూరంలో బెల్ట్‌షాపులా?

- **పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలపై గ్రామస్థుల ఆందోళన**
- **క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్**



ఎల్కతుర్తి, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల పేరుతో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో పాఠశాలలకు సమీపంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతాలకు సమీపంలో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పరిసరాల్లో ఇలాంటి కార్యకలాపాలు కొనసాగితే విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనుమతులు ఉన్నాయా?

మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా అనే అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మద్యం విక్రయాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి, నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ వసూళ్ల ఆరోపణలపైనా విచారణ

మద్యం విక్రయాల వ్యవహారానికి సంబంధించి కొందరి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంతమేరకు ఉందో అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. దీంతో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీల కోసం ఎదురుచూపులు

మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణపై గతంలోనూ అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదని కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలల పరిసరాలు, రహదారుల పక్కన ఉన్న ప్రాంతాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మద్యం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది నిర్ధారించాలని కోరుతున్నారు.

ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

విద్యార్థుల భద్రత, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని పలు గ్రామాల్లో, ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

చిన్న కాళేశ్వరానికి మళ్లీ కదలిక

- దశాబ్దాల సాగునీటి కలకు ప్రభుత్వ చర్యలతో కొత్త ఆశలు45 వేల ఎకరాలకు సాగునీరు.. భూసేకరణ, నిధులపై ముందడుగు

- ఏగోలపు సంతోష్ గౌడ్



మంథని, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని ప్రాంత రైతుల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసే చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వ స్థాయిలో సమీక్షలు నిర్వహించడం, నిధులు, భూసేకరణ, అనుమతుల అంశాలపై దృష్టి సారించడంతో ప్రాజెక్టులో కదలిక కనిపిస్తోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 45 వేల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రయాణం

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి 2007లో పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. 2008లో సవరించిన అంచనాలతో ప్రాజెక్టు వ్యయం పెరిగింది. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. మంథని ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో రూపొందిన ఈ పథకాన్ని దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు కలల ప్రాజెక్టుగా స్థానికులు గుర్తుచేసుకుంటారు. ఈ నేపథ్యంలో తన తండ్రి ఆశయంతో ముడిపడిన ప్రాజెక్టును పూర్తి చేయడంపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

రూ.571.57 కోట్లకు పరిపాలనా అనుమతి

2024 నవంబర్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఉన్నతాధికారులతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రూ.571.57 కోట్ల పరిపాలనా అనుమతి లభించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ పథకం ద్వారా 45 వేల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటి అవసరాలకు నీటిని అందించాలనే లక్ష్యం ఉందని తెలిపారు.

భూసేకరణపై ముందడుగు

ప్రాజెక్టు పూర్తికి భూసేకరణ కీలకంగా మారింది. సుమారు 1,500 ఎకరాలకు భూసేకరణ అనుమతులు లభించగా, మరో 2,800 ఎకరాలకు సంబంధించిన భూ సర్వే పూర్తయినట్లు స్థానిక సమాచారం. భూముల సేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. 2026లో మిగిలిన భూసేకరణకు రూ.166.67 కోట్ల మేర నిధుల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. భూసేకరణ పూర్తయితే కాలువలు, పైపులైన్లు, ఇతర అనుబంధ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



రూ.1,017 కోట్లకు సవరించిన అంచనా

2026–27 ధరల ఆధారంగా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం సుమారు రూ.1,017 కోట్లకు చేరినట్లు తాజా వివరాలు పేర్కొంటున్నాయి. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక ప్రణాళికకు ఇది మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. అదేవిధంగా రుద్రారం ప్రధాన కాలువ, ఆర్ఎంసీ–1, డి–2/ఎం–2, ఆర్ఎంసీ–3/బి–1 పరిధిలో గ్రామాల సర్వే పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. సర్వే, భూసేకరణ, పరిహారం చెల్లింపులు, నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టడం ద్వారా ప్రాజెక్టు పనులకు వేగం పెంచే అవకాశం ఉంది.

నాలుగు మండలాలకు ప్రయోజనం

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి మంథని ప్రాంతంలోని సాగు భూములకు అందించాలనే లక్ష్యం ఉంది. సుమారు 4.5 టీఎంసీల నీటిని వినియోగించే ఈ పథకం ద్వారా మహాదేవపూర్, మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాల పరిధిలోని గ్రామాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తయితే వర్షాధార సాగుపై ఆధారపడుతున్న రైతులకు సాగునీటి భరోసా లభించడంతోపాటు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. తాగునీటి అవసరాలకు కూడా నీటిని వినియోగించాలనే లక్ష్యం ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు అదనపు ప్రయోజనం చేకూరనుంది.

ఇక పనుల వేగంపైనే రైతుల దృష్టి

అనుమతులు, భూసేకరణ, నిధుల అంశాల్లో పురోగతి కనిపిస్తున్న నేపథ్యంలో ఇక నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయడంపైనే రైతుల దృష్టి ఉంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పూర్తయి గోదావరి జలాలు తమ పొలాలకు చేరాలని మంథని ప్రాంత రైతులు కోరుతున్నారు.

రైతుల పంటలకు నీరే ప్రధానం

నీటిపారుదల నిపుణులు వై.వి. రావు మాట్లాడుతూ రైతుల పంటలకు నీరే ప్రధానమని అన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే మంథని ప్రాంత రైతులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు నీరు అందించడం వల్ల కలిగే ప్రయోజనం ఎంతో గొప్పదని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చర్యలు వేగవంతం కావాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక

- తెలంగాణలో అధిక ప్రమాదాలున్న ఏడు జిల్లాలపై ప్రత్యేక దృష్టి

- 'జీరో ఫాటాలిటీ' లక్ష్యంగా 4ఈ విధానం.. ఈ-డార్‌లో ప్రమాదాల సమగ్ర నమోదు


మంథని, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అధిక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న 100 జిల్లాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో తెలంగాణలో ఏడు జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లో ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి, 'జీరో ఫాటాలిటీ' లక్ష్యంతో సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ అంశంపై డీజీపీ సీవీ ఆనంద్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రాంతాలపై సమగ్ర విశ్లేషణ

ప్రతి జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, మరణాలు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, వాటికి దారితీస్తున్న కారణాలు, ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న సమయాలను సమగ్రంగా విశ్లేషించాలని డీజీపీ సూచించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మార్గదర్శక్ పోర్టల్, డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని ఆదేశించారు.2024, 2025 సంవత్సరాల ఈ–డార్ గణాంకాల ఆధారంగా తెలంగాణలోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో 48 కీలక ప్రమాద కారిడార్లను గుర్తించారు. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ మరణాలు నమోదైన 230 ప్రాధాన్య ప్రమాద ప్రాంతాలు, 220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 183 కీలక పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో రహదారి నిర్మాణం, ఇంజినీరింగ్ లోపాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, ప్రమాదాలు జరిగే సమయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు.

ఏటా 1.75 లక్షల మంది మృతి

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఏటా సుమారు 1.75 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో ఏటా ఏడు వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని, రోడ్డు ప్రమాద మరణాల్లో తెలంగాణ దేశంలో ఏడో స్థానంలో ఉందని పేర్కొన్నారు.ప్రమాదాల నివారణ కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిర్వహణ విభాగం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయని తెలిపారు.





'4ఈ' విధానంతో ప్రమాదాల కట్టడి

రోడ్డు ప్రమాదాల నివారణకు విద్య, ఇంజినీరింగ్, అమలు, అత్యవసర సహాయం అనే నాలుగు అంశాలతో కూడిన '4ఈ' విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. రహదారుల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దడంతోపాటు, ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయాలని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ-డార్‌లో ప్రతి ప్రమాదం నమోదు

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రతిసారీ ఎల క్ట్రానిక్ డిజిటల్ ప్రమాద నివేదికను నమోదు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ప్రమాదాలు, క్షతగాత్రుల వివరాలతో పాటు ప్రమాద స్థలాల భౌగోళిక గుర్తింపు చిత్రాలను మార్గదర్శక్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తించి భవిష్యత్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు.

నగరంలో పార్కింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి

వీడియో సమావేశం అనంతరం హనుమకొండ–వరంగల్ నగరంలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అధికారులతో సమీక్షించారు. పార్కింగ్, నో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారులు, రహదారులు–భవనాలు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై లేన్ గుర్తులు, కూడళ్ల వద్ద జీబ్రా క్రాసింగ్‌లు, అవసర మైన చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి భద్రతకు సంబంధించిన చర్యలను అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టాలని పేర్కొన్నారు. నవంబర్ 3న చెన్నైలో జరిగే సమావేశంలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో ఎంపిక చేసిన ఏడు జిల్లాల్లో చేపట్టిన చర్యలను మరింత వేగవంతం చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, జాతీయ రహదారుల వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఉప రవాణా కమిషనర్ సురేష్ రెడ్డి, రహదారులు–భవనాల శాఖ అధికారులు కిరణ్ కుమార్, దేవిక చౌహాన్, జిల్లా రవాణాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ రాజ్ కుమార్, నగర ప్రణాళిక అధికారి రవీంద్ర రెడేకర్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

లింగపేట, ధర్మవరం ఇసుక క్వారీలను నిలిపివేయాలి

- పట్టాభూముల్లో అక్రమంగా అనుమతులు పొందారంటూ బీఆర్ఎస్ నేత ఆరోపణ
- నిజానిజాలు తేలే వరకు తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు వినతి



వాజేడు, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): వాజేడు మండలంలోని లింగపేట, ధర్మవరం గ్రామాల్లో నిర్వహిస్తున్న పట్టాభూముల ఇసుక క్వారీలను తక్షణమే నిలిపి వేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమాళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వాజేడు మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఇసుక క్వారీలకు సంబంధించిన భూములు పట్టాభూములుగా చూపించి, మండల సర్వేయర్, తహసీల్దార్ అధికారులను తప్పుదోవ పట్టించి అనుమతులు పొందేలా చేశారని ఆరోపించారు. వాస్తవానికి ఆయా పట్టాభూములు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు.ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక క్వారీల పేరుతో లక్షలాది రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజానిజాలు తేలే వరకు లింగపేట, ధర్మవరం ఇసుక క్వారీల్లో తవ్వకాలను నిలిపివేయాలని ఆయన అధికారులను కోరారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- 'ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి'
- సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత



వరంగల్, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో అక్టోబర్ నెలను సైబర్ మోసాలపై అవగాహన కల్పించే నెలగా నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఫోన్ కాల్స్, సందేశాలు, వాట్సాప్, ఈ-మెయిల్స్ లేదా అనుమానాస్పద లింకులు వచ్చినప్పుడు 'ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి' అనే విధానాన్ని పాటించాలని సూచించారు. ఖాతా వివరాల ధృవీకరణ పేరుతో వచ్చే సందేశాలు, బ్యాంకు ఖాతా నిలిపివేత, లాటరీ, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులపై భారీ లాభాలు వంటి పేర్లతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దన్నారు.ఆన్‌లైన్ కొనుగోళ్లలో భారీ రాయితీలు, అతి తక్కువ ధరల పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ చిరునామా, విక్రేత వివరాలను పరిశీలించి ధృవీకరించుకోవాలని తెలిపారు.ఒకసారి వినియోగించే రహస్య సంకేతం, యూపీఐ రహస్య సంఖ్య, ఏటీఎం లేదా డెబిట్ కార్డు వివరాలు, కార్డు భద్రతా సంఖ్య, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య, సంకేత పదాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని, అత్యవసరంగా డబ్బు పంపాలని ఒత్తిడి చేసే వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, కమిషనరేట్ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.



మూడేళ్లుగా హైమాక్స్ లైట్లు మూలకే!



వర్ధన్నపేట, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై వర్ధన్నపేట మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి సంఘం వాగు వద్ద ఉన్న హైమాక్స్ లైట్లే నిదర్శనంగా మారాయి. వర్ధన్నపేట నుంచి కొత్తపెళ్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సంఘం వాగు వద్ద ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు మూడేళ్లు దాటినా పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో రాత్రివేళ ఆ ప్రాంతం చీకటిమయంగా మారుతోంది. హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తీసుకు రావడంపై అధికారులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన రహదారి కావడంతో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని, వెలుతురు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, రహదారి పరిస్థితులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు వెలిగేందుకు ముహూర్తం ఎప్పుడు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాన్ని కూడా ఇంతకాలం నిర్లక్ష్యం చేయడం ఏమిటని నిలదీస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సంఘం వాగు వద్ద ఉన్న హైమాక్స్ లైట్లను వెంటనే మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో వెలిగించాలని, రాత్రివేళ ప్రయాణికులకు భద్రత కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యువతికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం

- దళిత యువతి ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సంఘీభావం
- ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్



వర్ధన్నపేట, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్‌పై ఓ దళిత యువతి చేసిన ఆరోపణల నేపథ్యంలో కొనసాగుతున్న ఆందోళన మూడో రోజుకు చేరింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యువతి కుటుంబ సభ్యులతో కలిసి చైర్మన్ ఇంటి ఎదుట బస చేస్తూ నిరసన కొనసాగిస్తోంది. దీంతో ఈ వ్యవహారం వర్ధన్నపేటలో రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారింది. యువతి ఆరోపణల ప్రకారం.. ప్రేమ, పెళ్లి పేరుతో తనను నమ్మించి మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేస్తోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి వైపు నుంచి పూర్తి వివరణ, అధికారిక విచారణ వివరాలు వెలువడాల్సి ఉంది.

యువతికి అండగా అరూరి రమేష్

యువతి కొనసాగిస్తున్న ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సంఘీభావం తెలిపారు. యువతికి న్యాయం చేయాలని, ఆమె చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. పార్టీలకు అతీతంగా యువతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఆరోపణలపై పోలీసులు, సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆయన కోరినట్లు పేర్కొన్నారు.

ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకోవాలి


మున్సిపల్ చైర్మన్ కుమారుడిపై యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు, అధికారులు నిష్పక్షపాతంగా స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆరోపణలు విచారణలో నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

న్యాయం జరగకపోతే ఉద్యమం ఉధృతం

యువతికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కాగా, ఈ వ్యవహారంపై అధికారిక విచారణలో వెల్లడయ్యే వాస్తవాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నాలుగు నెలలుగా జీతాల్లేవు.. దసరాకైనా ఇవ్వండి

- సాంఘిక సంక్షేమ గురుకులాల పార్ట్‌టైం ఉపాధ్యాయుల ఆవేదన
- జూన్‌లో డెమో ద్వారా విధుల్లో చేరిన 574 మందికి వేతనాల కోసం ఎదురుచూపులు



హనుమకొండ, అక్టోబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వారి బాగోగులు చూసుకుంటున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2026 జూన్‌లో డెమో ద్వారా ఎంపికై విధుల్లో చేరిన 574 మంది ఉపాధ్యాయులకు ఇప్పటివరకు జీతాలు అందలేదని చెబుతున్నారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు.

ఐఎఫ్ఎంఎస్‌లో నమోదైతేనే..

డెమో ద్వారా కొత్తగా నియమితులైన పార్ట్‌టైం ఉపాధ్యాయుల్లో ఐఎఫ్ఎంఎస్‌లో వివరాలు నమోదైన వారికి మాత్రమే వేతనాలు అందుతున్నాయని, మిగిలిన వారికి జీతాలు నిలిచిపోయాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కొత్తగా నియమితులైన వారి వివరాలను ఐఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసి వేతన బిల్లుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాల స్థాయిలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. వివరాల నమోదు, బిల్లుల తయారీ ప్రక్రియ సకాలంలో పూర్తయితే ఈ సమస్య తలెత్తేది కాదని వారు పేర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో ఇళ్ల అద్దెలు, కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, నిత్యావసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాల పెంపుపై చిగురించిన ఆశలు

ఇదిలా ఉండగా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో పార్ట్‌టైం ఉపాధ్యాయుల వేతనాల పెంపు అంశాన్ని బోర్డు సమావేశం అజెండాలో చేర్చినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో తమ వేతనాలు కూడా పెరుగుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇతర గురుకుల సొసైటీలతో పోలిస్తే తమకు తక్కువ వేతనాలు అందుతున్నాయని వారు పేర్కొంటున్నారు. మైనారిటీ గురుకులాల్లో జూనియర్ లెక్చరర్లకు రూ.36 వేల వరకు, పీజీటీ ఉపాధ్యాయులకు రూ.28 వేల వరకు వేతనం ఉండగా.. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో జూనియర్ లెక్చరర్లకు రూ.23,400, పీజీటీలకు రూ.18 వేలుగా ఉందని చెబుతున్నారు. ఇతర సొసైటీలతో పోల్చి తగిన స్థాయిలో వేతనాలను పెంచాలని కోరుతున్నారు.

దసరాకైనా జీతాలు ఇవ్వండి

విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడం బాధాకరమని పార్ట్‌టైం ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఒకవైపు విద్యార్థుల బాధ్యతలు నిర్వర్తిస్తూ.. మరోవైపు కుటుంబాలను పోషించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి, ఉప కార్యదర్శి, సంబంధిత ప్రాంతీయ కార్యాలయాల అధికారులు, ప్రధాన కార్యాలయ అధికారులు వెంటనే స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఐఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న వివరాల నమోదును పూర్తి చేసి, నిలిచిపోయిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే బోర్డు సమావేశంలో వేతనాల పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం మేము పనిచేస్తున్నాం. మా కుటుంబాల పరిస్థితిని కూడా అధికారులు అర్థం చేసుకోవాలి. కనీసం దసరా పండుగకైనా పెండింగ్ జీతాలు విడుదల చేయాలి. వేతనాల పెంపు ప్రతిపాదనను కూడా ఆమోదించి మాకు న్యాయం చేయాలి" అని పలువురు పార్ట్‌టైం ఉపాధ్యాయులు కోరుతున్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com